రిపోర్టులన్నీ చూపించాడు. ఆపరేషన్ తప్పదని గ్రహించిన సర్జన్ అయనకో డేట్ ఇచ్చాడు. దానికి ముందురోజు పారిశ్రామికవేత్త ఆసుపత్రిలో చేరాడు. సర్జన్‌ని భయంగా అడిగాడాయన.

"ప్రమాదమేమీ వుండదు కదా? ఆపరేషన్ సక్సెస్ అవుతుందిగా?"

చిన్నగా నవ్వి చెప్పాడు సర్జన్.

"భయంలేదు. అంతా బాగా జరుగుతుంది. నేనే కాక మరొకరు కూడా సహాయం చేస్తారు కదా!"

ఆపరేషన్ విజయవంతమైంది. తనని చూడడానికి వచ్చిన సర్జన్‌ని అడిగాడా రోగి.

"నేనో చిన్న ప్రశ్న అడుగుతాను. దయచేసి జవాబు చెప్తారా?"

"చెప్తాను. అడగండి."

"నా ఆపరేషన్ విజయవంతం అవడంలో మీకు ఎవరో మూడో మనిషి సహాయం చేస్తారన్నారు. కానీ ఆపరేషన్ గదిలో మీరు తప్ప మరో సర్జన్ ఎవరూ నాకు కనిపించలేదు. ఆ మూడో వ్యక్తి ఎవరు?"

"ఈ ప్రశ్నకి ఎవరికీ చెప్పని జవాబు మీకు చెప్తున్నాను. ఆ మూడో వ్యక్తి భగవంతుడు. సర్జన్‌గా నా నైపుణ్యం ఒక్కటే సరిపోదు. దానికి దేవుని కృప కూడా కావాలి. అప్పుడే నేను నా కర్తవ్యాన్ని విజయవంతం చేయగలను. నా ప్రతీ విజయానికి కారణం ఆ అదృశ్య మూడో వ్యక్తి కృప అనే నేను గాఢంగా నమ్ముతాను." ఎంతో విశ్వాసంతో చెప్పాడాయన.

## 27. ప్రార్థన ఫలితం

ఓ కొండకి ఆనుకుని వున్న ఓ పురాతన ఆలయం ట్రస్టీలు సమావేశమయ్యారు. గుడికి వచ్చే భక్తుల తాకిడి అధికమవుతూండడంతో అదనంగా వసతి గృహనిర్మాణం విషయం వారు చర్చించారు.

"ఫ్రండ్స్! భవంతికి సరిపడే భూమి ఆలయం ఆవరణలో లేదు. గుడి వెనకగల కొండని కొంతమేర తవ్వితే మనం కట్టాలనుకున్న భవంతికి సరిపడే చోటు లభిస్తుంది." చెప్పాడో సభ్యుడు.

"కానీ అందుకు చాలా ఖర్చవుతుంది. మన వద్ద అంత డబ్బు లేదు."

"అలాగైతే అదేదో తననే చూసుకోమని ఆ దేవుడినే ప్రార్థిద్దాం." సూచించాడు ఛైర్మన్.

"ప్రార్థనలతో అయ్యే పనటండీ ఇది? నిధులెలా సమకూర్చుకోవాలో ఆలోచిద్దాం." చెప్పాడు మరో సభ్యుడు.

"మనం మామూలు వ్యాపారం మీటింగ్‌లో లేము. సాక్షాత్తూ భగవంతుడి కోసం వచ్చే భక్తుల సౌకర్యం గురించిన ఆలోచనలో వున్నాం. కాబట్టి, దేవుడి మీద నమ్మకం వుంచి ఆయన్ని ప్రార్థిద్దాం. ఆ విశ్వాసమే కొండని కదపగలదు." చెప్పాడు భక్తుడైన ఛైర్మన్.

సభ్యులందరూ దైవ భక్తులు కాబట్టి, కళ్ళు మూసుకుని, కొండని కదిపి, తమకి కావలసిన స్థలం దొరికేలా చేయమని మనసులోనే ఆ గుడిలోని దేవుణ్ణి ప్రార్థించారు. వారం తర్వాత తిరిగి కలుసుకోవాలని అంతా నిర్ణయించుకున్నారు. విడిపోయే ముందు ఛైర్మన్, మిగిలిన సభ్యులకి 'ఈ వారం మొత్తం దేవుణ్ణి ప్రార్థించడం ఎవ్వరూ మర్చిపోవద్దు' అని చెప్పాడు.

మళ్ళీ వారం మీటింగ్‌లో ట్రస్ట్ సభ్యులంతా కలుసుకున్నారు.

సమావేశం ప్రారంభం కాగానే కార్యదర్శి వాళ్ళ ముందో ఉత్తరం ఉంచాడు. అది రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు, భవనాల శాఖ నించి వచ్చింది.

'మీ గుడికి దగ్గర్లోని ఒక రోడ్డు మరమ్మత్తుకి కొంత కొండరాయి అవసరమైంది. కనుక గుడి వెనుక వున్న కొండని పగలకొట్టి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన నష్ట పరిహారం చెల్లిస్తాం. ట్రస్ట్ అనుమతిని కోరుతున్నాం.'

"మనం నిర్మించాలనుకున్న భవంతికి ఎంత స్థలం కావాలో సరిగ్గా అంతే మేర కొండ కదిలి ఖాళీ కాబోతోంది." చిరునవ్వుతో చెప్పాడు కార్యదర్శి.

తమ ప్రార్థనని మన్నించినందుకు ఆ ట్రస్ట్ సభ్యులంతా ఆనందంగా ఆ దైవానికి పదేపదే కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

## 28. స్ఫురణ

ఓ గురువు దగ్గర శిష్యులు కొందరు ఓ రోజు ఒక సందేహం వెలిబుచ్చారు.

"గురుదేవా! మాకు దేవుడి మీద మనసు నిలవడం లేదు. కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చుంటే మాకు ఆయన రూపం గుర్తు రాకుండా వుంది."

వారి వంక వాత్సల్యంగా చూస్తూ చెప్పాడు గురువు.

"దీక్షగా చూస్తే జ్ఞప్తిలో వుండనిది ఏదీలేదు అన్నది మీకింకా అర్థం కాలేదన్నమాట."

ఆయన తన సంచీలోంచి కొన్ని నిమ్మపళ్ళు తీసి శిష్యుల చేతికిచ్చి చెప్పాడు.

"ఎవరి పండుని వారు పగలు,రాత్రి ఎప్పుడూ మీ చేతిలోనే వుంచుకోండి. దాన్ని చూస్తూ, వాసన చూస్తూ నేను చెప్పేదాకా అదే పని మీద వుండండి. ఇంక వేరే ఏ పనీ మీరు ఈ వారం రోజులు చేయద్దు."

శిష్యులు గురువు చెప్పినట్లే తమ నిమ్మపళ్ళని రెండు రోజులపాటు చేతిలో వుంచుకుని, వాటివంక చూస్తూ, వాసన చూస్తూ గడిపారు.

మూడోరోజు గురువు తమ శిష్యులని పిలిచి చెప్పాడు.

"మీ మీ నిమ్మపళ్ళని ఈ సంచీలో వేయండి."

వారంతా నిమ్మపళ్ళని ఆ సంచీలో వేసాక, గురువు వాటిని తిరిగి నేలమీద పోసి చెప్పాడు.